Office Of The Advisor (communications)
Govt. Of Andhra Pradesh

# స్కూళ్లు, కాలేజీలకు ఇక అక్రిడిటేషన్

## విద్యా సంవత్సరం ఆరంభంలోగా టీచర్ల బదిలీలు: సీయం చంద్రబాబు

అమరావతి, ఏప్రిల్ 13 : రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలన్నింటికీ ఫలితాల ఆధారంగా అక్రిడిటేషన్ ఇచ్చే విధానాన్ని తక్షణం అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్దేశించారు. నిర్దిష్ట ప్రమాణాలతో కూడిన విద్య, విజ్ఞానాలను అందించే విద్యా సంస్థలకు ప్రపంచస్థాయి అక్రిడిటేషన్ బోర్డులతో గుర్తింపు ఇవ్వగలిగితే పోటీతత్వం పెరిగి రాష్ట్రాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని తక్కువ సమయంలోనే చేరుకోగలుగుతామని అన్నారు. ఈ అక్రిడిటేషన్ జిల్లా, రాష్ట్ర స్థాయిలలో జరపాలని సూచించారు. ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల నియామకాలు ఒక ప్రత్యేక కమిటీ ద్వారా జరిగితే ప్రభుత్వ విద్యాలయాల్లో ప్రమాణాలు మెరుగుపడతాయని చెప్పారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి ఉపాధ్యాయుల బదిలీలు పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ ఏడాది మొత్తం 3500 వర్చువల్ తరగతి గదులను ఏర్పాటుచేయాలని చెప్పారు. గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన కార్యాలయంలో మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావుతో కలిసి ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత, సాంకేతిక విద్యాశాఖల పనితీరును సమీక్షించారు.

కళాశాల విద్యలో 75 శాతం విద్యార్థులు ప్రైవేట్ రంగంపై ఆధారపడ్డారని, 25 శాతం మాత్రమే ప్రభుత్వ కళాశాలల్లో చదువుకుంటున్నారని, అదే ప్రాథమిక విద్యలో ఈ సంఖ్య 50:50 శాతంగా వున్నదని మంత్రి గంటా శ్రీనివాసరావు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ విద్యా సంస్థలు, కళాశాలల్లో ప్రమాణాలు పెంచుకుని ఫలితాలు సాధించడం ఒక్కటే దీనికి పరిష్కార మార్గమన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు–ఆ దిశగా ఈ విద్యా సంవత్సరం నుంచే తగిన కసరత్తు ఆరంభించాలని చెప్పారు. ఇప్పటికే విద్యారంగంలో పెమాండు సహకారంతో కొన్ని కీలక సంస్కరణలు ప్రవేశపెట్టామని గుర్తుచేశారు. సంక్షేమ హాస్టళ్లను గురుకుల పాఠశాలలుగా మార్చడం, అన్ని విద్యాసంస్థల్లో బయో మెట్రిక్ హాజరు విధానాన్ని ప్రవేశపెట్టడం, పట్టణ ప్రాంత ఉన్నత పాఠశాలలలో ఐఐటీ వంటి పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడం వంటి కార్యక్రమాలను అమలుచేయడం ద్వారా మెరుగైన ఫలితాలను సాధించగలుగుతున్నామని చెప్పారు.

### ప్రాథమిక వసతులకు రూ.3449 కోట్లు

ఏపీని నాలెడ్జ్ స్టేట్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యసాధనలో భాగంగా ఈసారి బడ్జెట్‌లో ఉన్నత విద్యకు రూ.22 వేల కోట్లు, పాఠశాల విద్యకు రూ.18 వేల కోట్లు కేటాయించామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థలలో అత్యుత్తమ మౌలిక సదుపాయాలు కల్పించడం, నాణ్యమైన విద్యను అందించడం ద్వారా చక్కటి వాతావరణాన్ని సృష్టించగలిగితే ప్రభుత్వ విద్యారంగంలో మళ్లీ పూర్వ వైభవం తీసుకురావచ్చునని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థిపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ఎలా చదువుతున్నాడు, పరిక్షలు ఎలా రాస్తున్నాడు నిశితంగా దృష్టి పెట్టి చదివిస్తే కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు వస్తాయని అన్నారు. వాస్తవానికి ప్రైవేట్ విద్యాసంస్థల్లో లేని వనరులు ప్రభుత్వ విద్యాలయాల్లో వున్నాయని ప్రస్తావించారు. 44,591 ప్రభుత్వ పాఠశాలల్లో ఫర్నిచర్, ప్రహారి గోడల నిర్మాణం, వంట షెడ్డులు వంటి ప్రాథమిక వసతుల కోసం రూ.3,449 కోట్లు అవసరం అవుతాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలుపగా, ఉపాధి హామీ నిధుల వినియోగంతో అవసరమైన పనులన్నీ పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు. గణిత శాస్త్రంలో ఏపీ జాతీయస్థాయిలో 5వ స్థానంలో వున్నదని అధికారులు చెప్పగా, ఈ ఏడాది ప్రథమ స్థానంలో వచ్చేందుకు తగిన కృషి చేయాలని సూచించారు.

## ప్రత్యేక కమిటీల ద్వారా ప్రధానోపాధ్యాయుల ఎంపిక

ప్రధానోపాధ్యాయుడిగా సరైన వ్యక్తి వున్న పాఠశాలల్లో ఫలితాలు బాగుంటాయని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఇతర రాష్ట్రాలలో ప్రధానోపాధ్యాయులను ప్రత్యేక పద్ధతుల్లో నియమించే విధానాలు అమలులో వున్నాయని, ఎక్కువ అర్హతలు, అనుభవం, సామర్థ్యం వున్నవారిని ప్రత్యేక కమిటీలు ఎంపిక చేస్తాయని చెప్పారు. మన రాష్ట్రంలో కూడా ఇకనుంచి ప్రధానోపాధ్యాయుల ఎంపికలో కొన్ని నిర్దిష్ట ప్రమాణాలు పాటించాలన్నారు. దీని వల్ల నాణ్యత తప్పకుండా పెరుగుతుందని చెప్పారు. అలాగే, కళాశాలల్లో ప్రిన్సిపాళ్లను కూడా అర్హులైన అధ్యాపకులను స్క్రీనింగ్ చేసి ఎంపిక చేయాలని సూచించారు. ప్రతి విద్యాసంస్థలో అంతర్గత సామర్థ్య లెక్కింపు జరగాల్సిన అవసరం వుందని అన్నారు. అంతిమంగా అక్రిడిటేషన్ జరిపించి తగిన గుర్తింపు ఇవ్వడం ద్వారా విద్యాసంస్థల మధ్య, ఉపాధ్యాయుల మధ్య పోటీతత్వాన్ని పెంపొందించాలని చెప్పారు. దీనికి పెమాండు సహకారం తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని విద్యార్థులు, ఉపాధ్యాయుల పని తీరు, ఫలితాలను ఆన్‌లైన్‌లో వుంచాలని చెప్పారు.

ఉపాధ్యాయులు స్వయం విశ్లేషణ చేసి పంపించే పద్ధతి కంటే, విద్యార్థులు సాధించే ఫలితాలు ఆధారంగా గురువుల పనితీరును గుర్తించే పద్ధతి అమలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆరంభంలో ఏ సంస్కరణకైనా అభ్యంతరాలు రావడం సహజమని, నిర్ణయాలు తీసుకున్నాక స్థిరంగా అమలు చేయడం వల్లనే పరిస్థితుల్లో మార్పులు వస్తాయని అన్నారు. ఇంటర్మీడియెట్ పరీక్షల్లో జంబ్లింగ్ విధానం దేశంలో ఎక్కడా లేదు

ఇక్కడ ఎందుకు అమలుచేస్తున్నారని ఆరంభంలో అందరూ వ్యతిరేకించారని, పారదర్శకంగా జరిగిన పరీక్షలు, రికార్డు సమయంలో వెల్లడైన ఫలితాలను చూసి ఇప్పుడు అందరూ దాన్ని ఆమోదించే పరిస్థితి వచ్చిందని అన్నారు.

## ప్రయోగాత్మకంగా 50 కేంద్రీకృత మధ్యాహ్న భోజన కేంద్రాలు

ఈ విద్యా సంవత్సరం నుంచే అన్ని పాఠశాలల్లోనూ డిజిటల్ తరగతులను నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఫిజికల్ లిటరసీలో యోగా ఒక పాఠ్యాంశంగా వుంటుందని, దానితో పాటు తప్పనిసరిగా కూచిపూడి నాట్యాన్ని నేర్పించాలని చెప్పారు. ఈ ఏడాది ప్రయోగాత్మకంగా 50 సెంట్రలైజ్డ్ మధ్యాహ్న భోజన కేంద్రాలు ఏర్పాటుచేయాలని తెలిపారు. ఇస్కాన్ వంటి సంస్థల ద్వారా నాణ్యమైన ఆహారం విద్యార్థులకు అందేలా చూడాలన్నారు. జూన్ 2 లోగా అన్ని పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన వంటశాలలకు గ్యాస్ కనెక్షన్లు అందేలా ఇప్పటినుంచే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కళాశాల విద్యకు సంబంధించి ఎన్ఐఆర్ఎఫ్–2017 ర్యాంకింగుల్లో మన రాష్ట్రం రెండవ స్థానంలో వున్నదని అధికారులు చెప్పగా, వచ్చే విద్యా సంవత్సరానికి నెంబర్ వన్‌గా మార్చడానికి తగిన కార్య ప్రణాళికలను రూపొందించుకుని అమలు చేయాలన్నారు. అన్ని కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు ఈ ఏడాది నుంచే ర్యాంకింగులు, అక్రిడిటేషన్లు ఇవ్వాలని ఆదేశించారు.

## టాపర్లతో ఫోన్‌లో మాట్లాడిన సీయం

నేడు విడుదల చేసిన ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాలలో ఎంపీసీ స్టేట్ టాపర్‌గా నిలిచిన షర్మిలకు ముఖ్యమంత్రి సమావేశంలోనే ఫోన్ చేసి మాట్లాడారు. టాపర్‌గా నిలిచినందుకు అభినందనలు తెలిపి షర్మిల కుటుంబ నేపథ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలని ఆశీర్వదించారు. ఇంటర్మీడియెట్ బైపీసీ టాపర్ నైమిషితో కూడా ముఖ్యమంత్రి ఫోన్‌లో మాట్లాడారు. కార్డియాలజిస్టు కావాలన్న నైమిషి అభిలాషను తెలుసుకుని అందుకు ఎటువంటి సహాయం కావాలన్నా చేసి పెడతానని చెప్పారు. సోమవారం ఇంటర్మీడియెట్ టాపర్స్‌ను ప్రత్యక్షంగా కలిసి మాట్లాడతానని సమావేశంలో ముఖ్యమంత్రి వెల్లడించారు.